క్లుప్తంగా

మ్యాజిక్ బోస్‌కు భారతీయ కళారత్న అవార్డు



భారతీయ కళారత్న అవార్డును అందుకుంటున్న మ్యాజిక్ బోస్

సాక్షి, భీమవరం: పట్టణానికి చెందిన మ్యాజిక్ బోస్‌కు గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ సంస్థ భారతీయ కళారత్న అవార్డునిచ్చింది. ఇంద్రజాల, సాహిత్య రంగాలకు చేస్తున్న సేవలకుగాను ఈనెల 12వ తేదీన గోవాలో ఈ అవార్డును సంస్థ అధ్యక్షుడు సునీల్ బెల్లావే ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బోస్‌ను పట్టణంలోని పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

ఆకివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు అమలు చేశారు. ప్రధాన కూడళ్లలో వివిధ రాజకీయ పార్టీ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ అమలులో ఉన్నంత వరకూ ఫ్లెక్సీలు ప్రదర్శించరాదని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నరసాపురం రూరల్: ఆధ్యాత్మిక విద్యలో విప్లవాత్మక మలుపు తిప్పిన భగవద్గీతలో మూడు ఆత్మలపై త్రైత సిద్ధాంత భగవద్గీత శాస్త్రీయంగా వివరించి బోధించిందని సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడి కుదురు కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా గీతా జయంతి మాసాన్ని పురస్కరించుకుని గ్రామస్తులకు అందించారు. త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రజలకు తెలియజేయడమే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు హనుమంతరావు, బ్రహ్మాజీ, సత్యవతి, చంటి, రమేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ



ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

పెనుగొండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఆచంట ప్రభుత్వ ఐటీఐలో నెల 15 నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకటసత్యనారాయణ రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ ఇంజనీరు, ఎయిర్ కండీషనర్ కోర్సులకు సంబంధించి మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఇంగ్లీషు, కంప్యూటర్స్, ఇంటర్వ్యూ, స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు 8, 9, 10వ తరగతి, ఇంటర్ పాస్ లేక ఫెయిల్, ఐటీఐ, డిప్లొమా పూర్తయినవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9573528272 నంబరులో సంప్రదించాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: కరాటే పోటీల్లో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు ప్రతిభచూపిట్లు ప్రధానోపాధ్యాయిని డి భవానీ తెలిపారు. ఆదివారం నిడదవోలు రంగా సుబ్బారావు, సత్యవతి కాపు కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి గోజో రియో ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి ఎస్ షారోని, ఎమ్ మోహిత్, పి ఫరీనా, ఎమ్ రోహిత్, ఎన్ కోమల, ఎ రమ్య ఆరుగురు బంగారు పతకాలు, ఎమ్ మహేష్, జి రాహుల్ రజత పతకాలు గెలుపొందినట్లు భవానీ తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ ఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు కోచ్ కె రాజు అభినందించారు.

సరోజినీ నాయుడుకు ఘన నివాళి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ భారత కోకిలగా పేరొందిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలని అన్నారు. భారతదేశ తొలి గవర్నర్‌గా పనిచేశారన్నారు. ఈ సందర్భంగా అమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాలులర్పించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, భవానీ, దుర్గ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతోనే పథకాల లబ్ధి



కుప్పనపూడిలో పంట వివరాలను పరిశీలిస్తున్న ఆర్బీకే జేడీ వల్లూరి శ్రీధర్



పాములపర్రులో రైతులతో ఆర్‌బీకే జేడీ శ్రీధర్, ఏడీఏ శ్రీనివాస్, ఏఓ సంధ్య

ఆకివీడు: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు తనిఖీలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ కమిషనరేట్ ఆర్బీకే జాయింట్ డైరెక్టర్ వల్లూరి శ్రీధర్ చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో సోమవారం ఈ-క్రాప్‌లో నమోదు అయిన 117.57 ఎకరాల భూమిని ఆయన పరిశీలించారు. భూమిలో సాగు చేసిన పంట వివరాలు, సర్వే నంబర్లు, రైతుల వివరాల్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రబీ వరి సాగు చేపట్టిన విషయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట వివిధ దశల్లో ఈ-క్రాప్ తనిఖీ జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు రైతులు అర్హత పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక, వీఏఏ లావణ్య, రైతు సంద్యాల చల్లారావు పాల్గొన్నారు.

పంట నమోదుతోనే రైతులకు మేలు

ఉండి: ప్రతి రైతు తాము పండించే పంట వివరాలను ఈ క్రాప్ యాప్‌లో తప్పకుండా నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలని వ్యవసాయ శాఖ ఆర్‌బీకే జేడీ వల్లూరి శ్రీధర్ అన్నారు. సోమవారం పాములపర్రులో వ్యవసాయాధికారుల బృందం పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 2022–23 ఏడాదికి గాను పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలు సేకరించి వారితో మాట్లాడి సాగు చేస్తున్న పొలాలను ఆయన పరిశీలించారు. పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలను పరిశీలించారు. కౌలుకు చేస్తున్నారా, సొంత భూమా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమంలో అధికారులు అనుసరిస్తున్న నిబంధనలు, నమోదు ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు. పంట నమోదు జరిగితేనే ప్రభుత్వం నుంచి రైతులకు చేకూరే లబ్ధి వారికి అందుతుందన్నారు. పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, ఆర్‌బీకేల ద్వారా అందించే రుణాలు పొందే అవకాశం రైతులకు లభిస్తుందన్నారు. కనుక రైతులెవ్వరూ నిర్లక్ష్యం చేయకుండా ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించి లేదా వ్యవసాయాధికారి ద్వారా పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్, ఏఓ బీ సంధ్య, వ్యవసాయాధికారులు వై.సంధ్య, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకోడు లేఅవుట్ పరిశీలన

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న లేఅవుట్‌ను సోమవారం భీమవరం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం సమతా నగర్‌లోని స్పందన ఫిర్యాదును పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో నడక దారిని లేకుండా చెరువుదారులు ఆక్రమించారని ఫిర్యాదుపై ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులతో సమావేశం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన గృహ సారథుల సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. ఉదయం పేరుపాలెం నార్త్, సౌత్, కేపీపాలెం నార్త్, సౌత్, వారతిప్ప, మోడి గ్రామాలకు సంబంధించి సమావేశం పేరుపాలెం సౌత్-1 సచివాలయంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3గంటలకు ముత్యాలపల్లి, కొత్తోట, కాళీపట్నం తూర్పు, పడమర, జగన్నాథపురం, పాతపాడు, కోమటితిప్ప గ్రామాలకు సంబంధించి కాళీపట్నం పడమరలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశాలకు ఆయా గ్రామాలకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఎఫ్‌డీవోగా ముత్యాలపల్లి యువతి

మొగల్తూరు: ముత్యాలపల్లికి చెందిన కొల్లాటి భారతి రాష్ట్ర మత్స్యశాఖలో మత్స్యశాఖాధికారిగా ఎంపికయ్యారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడైన కొల్లాటి రామారావు, పార్వతి దంపతుల కుమార్తె ఎంఎఫ్ఎస్‌సీలో విద్యనభ్యసించారు. రాష్ట్ర ప్రభుత్వం 2021లో మత్స్యశాఖలో ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న ఆమె 2022లో నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో ఉత్తీర్ణత సాధించడంతో ఈనెల ఫిబ్రవరి 10న మత్స్యశాఖ శాఖ నుంచి ఎఫ్‌డీవోగా అర్హత సాధించినట్లు సమాచారం అందడంతో తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు, పార్టీ నాయకులు భారతిని అభినందించారు. ఈనెల 21న అమరావతిలోని మత్స్యశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు భారతి తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెనుగొండ: పంచాయతీలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు షేక్ పాదుషా, కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయాలి

కోడి పందేల దిబ్బలో కాలనీ వాసులకు రేషన్ సరకులు అందించాలని తహసీల్దారు జి గురుమూర్తి రెడ్డికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. మాదాసు నాగేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషాలు పాల్గొన్నారు.

స్పందనలో నాలుగు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందనలో నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని చినమిల్లిపాడు గ్రామానికి చెందిన విప్పర్తి సుబ్బారావు, కాళింగగూడెం నివాసి సనపల సూర్యనారాయణ 2016–17లో ఇంటి నిర్మాణానికి దస్తావేజులు ఇచ్చి రుణం తీసుకుని సొమ్ము చెల్లించగా, దస్తావేసులు తిరిగి ఇవ్వలేదని, వాటిని ఇప్పించాలని కోరారన్నారు. దుంపగడప గ్రామానికి చెందిన పిన్నమరాజు వెంకట రవివర్మ, పిన్నమరాజు రంగరాజు వేర్వేరు ఫిర్యాదుల్లో తమకు చెందిన భూమిని వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో సక్రమంగా నమోదు చేయలేదని, తమ దస్తావేజులను పరిశీలించి, 1బీలో తన భూమిని నమోదు చేయించాలని ఫిర్యాదు చేశారన్నారు. ఆకివీడుకు చెందిన నేతల నళినీ జయంతి సంతపేటలో తనకు అమ్మిన రెండున్నర సెంట్ల భూమి రికార్డులు సక్రమంగా లేవని, తప్పుడు కొలతలు, ఫోర్జరీ, నకిలీ దస్తావేజులు పుట్టించి స్థలం విక్రయించారని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. వీటితో పాటు మరో మూడు ఫిర్యాలు అందాయని శ్రీకర్ వివరించారు.

సచివాలయ సముదాయంపై ఆరోపణ తగదు



కుప్పనపూడిలో మాట్లాడుతున్న బంటుమిల్లి పుణ్యవతి, మెంటే లక్ష్మణరావు

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనంలో మైనర్ పనులు పూర్తి చేయాల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు బంటుమిల్లి పుణ్యవతి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు చెప్పారు. సచివాలయాలను ప్రారంభించలేదని తాను ఆరోపణలు చేసినట్లుగా వచ్చిన వార్తలను బంటుమిల్లి పుణ్యవతి ఖండించారు. సచివాలయ సముదాయాన్ని పరిశీలించేందుకు వెళ్లానే తప్ప ఏ విలేకరులతోనూ తాను మాట్లాడలేదన్నారు. కావాలనే కొన్ని పత్రికలు తనపై బురదజల్లాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసి మార్చి నెలాఖరునాటికి పంచాయతీకి అప్పగిస్తారన్నారు. టీడీపీ నాయకులు, పంచాయతీ పాలకులు కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. మెంటే లక్ష్మణరావు మాట్లాడుతూ టీడీపీ 30 ఏళ్ల పాలనలో పంచాయతీకి సరైన గూడు లేదన్నారు. గ్రామంలో ఏ విధమైన అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ నాయకుల మధ్య ఉన్న స్పర్ధలతో గ్రామాభివృద్ధిని విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల స్థానే సచివాలయాలు, ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌లు నిర్మాణాన్ని చరిత్రాత్మకంగా నిర్మిస్తున్నారని చెప్పారు. పనులు జరుగుతున్న తరుణంలో బిల్లులు వస్తున్నాయన్నారు. సచివాలయ సముదాయ నిర్మాణానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో గ్రామానికి చెందిన మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనుల్ని పూర్తి చేశారని లక్ష్మణరావు చెప్పారు. పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తరుణంలో ఆందోళనలు చేస్తే తమకు పేరు వస్తుందని టీడీపీ నాయకులు చేసిన ఎత్తుగడల్ని ప్రజలు నమ్మరన్నారు. కార్యక్రమంలో సచివాలయ బూత్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ యాళ్ల రవికుమార్, విష్ణాలయ చైర్మన్ నూకల సత్యన్నారాయణ, శివాలయం చైర్మన్ నంద్యాల శివన్నారాయణ, బంటుమిల్లి సురేష్ పాల్గొన్నారు.

డ్రైవర్ల తొలగింపునకు నిరసనగా ధర్నా



దిరుసుమర్రులో ధర్నా చేస్తున్న డ్రైవర్లు, యూనియన్ నాయకులు

భీమవరం అర్బన్: దిరుసుమర్రులో ప్రైవేట్ ఆక్వా పరిశ్రమలో డ్రైవర్లను తొలగించడం దారుణమని యూనియన్ కార్యదర్శి అల్లూరి అరుణ్ అన్నారు. గ్రామంలో పరిశ్రమ వద్ద 10 మంది డ్రైవర్లను తొలగించడంపై యూనియన్ నాయకులు, డ్రైవర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి అరుణ్ మాట్లాడుతూ జీతాలు తగ్గించవద్దన్నందుకు యాజమాన్యం డ్రైవర్లను విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. యాజమాన్యం కక్ష్య సాధింపు ధోరణి వల్ల ఐదు నెలల నుంచి డ్రైవర్లకు జీతాలు లేక వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ శాంతియుతంగా చర్చలు జరిపినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, డ్రైవర్లను విధుల్లోకి తీసుకునే వరకు పరిశ్రమ వద్ద ధర్నా చేయడంతో పాటు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరిశ్రమ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుండాబత్తుల కోటేశ్వరరావు, నాయకులు ఎ.శ్రీనివాస్, శంకర్, సురేష్, కోటేశ్వరరావు, డి.శ్రీనివాస్, రాము, బాబి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణంపై విచారణ చేయాలి



కాళ్లకూరులో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

కాళ్ల: తమ గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పందనలో ఫిర్యాదు చేసినట్లు సోమవారం కాళ్లకూరు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన షోడదాసి గంగయ్య విలేకరులతో మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామంలోని పాత హరిజనవాడ, కొత్త కాలనీకి కలిపి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం కేటాయించిందన్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం కొత్తకాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించేందుకు తీర్మానం చేశారన్నారు. అప్పటి పంచాయతీ బోర్డు ప్రభుత్వం కేటాయించిన నిధులతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి భవనాన్ని గోడల వరకు నిర్మించి నిలిపివేశారని ఆరోపించారు. అయితే కట్టిన గోడలు శిథిలమై ప్రస్తుతం నిరుపయోగంగా మారిందన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు పౌష్టికాహారం ఇచ్చేందుకు సరైన భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల్లో జనసేనతో కలిసి బీజేపీ పోటీ



బీజేపీ పట్టణ కమిటీ నూతన సభ్యులను అభినందిస్తున్న శ్రీనివాసవర్మ

సాక్షి, భీమవరం: రానున్న ఎన్నికల్లో జనసేనతో జత కలిసి పోటీ చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పట్టణంలోని త్యాగరాజు భవనంలో సోమవారం పార్టీ పట్టణ కార్యవర్గ సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ విజయానికి పార్టీ శ్రేణులు ఐక్యమత్యంతో ఇప్పటి నుంచే కష్టించి పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీలో మార్పులు, చేర్పులు చేసి కొత్తవారికి అవకాశం ఇచ్చారు. నూతనంగా కమిటీలో చేర్చుకున్నవారిని శ్రీనివాసవర్మ అభినందించారు. ఈ సమావేశానికి పట్టణ శాఖ అధ్యక్షుడు కాయిత సురేంద్ర అధ్యక్షత వహించగా, పార్టీ నాయకులు కోమటి రవికుమార్, ఇంజేటి వెంకటేశ్వర్లు, షేక్ మొహిద్దీన్, పీవీఎస్ వర్మ, అల్లూరి సాయిదుర్గరాజు, పేరిచర్ల వెంకటశ్రీనివాసరాజు (సుభాష్), వబిలిశెట్టి ప్రసాదరావు, అడబాల శివ, జీవీకేఎల్ నారాయణ, వీరమల్లు సుష్మ, కిర్లంపూడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాండ్రంలో సువార్త ఉజ్జీవ మహాసభ

ఉండి: వాండ్రంలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం యేసుతో ఒక్కరోజు సువార్త మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘ సీఆర్ పాలపర్తి కెప్టెన్‌రాజు సోమవారం చెప్పారు. రాత్రి 7 గంటల నుంచి నిర్వహించే ఈ మహాసభను పేరిష్ పాస్టర్ వి.నెహ్రహా ప్రారంభిస్తారని, ఏలూరు ఎష్కోలు ప్రేయర్ ఫెలోషిప్ వ్యవస్థాపకుడు పాస్టర్ ఎం.ప్రభుదాస్ వాక్యోపదేశం చేస్తారని తెలిపారు. పరిసర ప్రాంతాల క్రైస్తవులు, విశ్వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని స్థానిక సంఘ పెద్దలు కోరారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

పెనుగొండ: మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. పెనుగొండ చైతన్యలో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో క్రీడాకారులు ఉన్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచి వీరిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చదువుతో పాటు, క్రీడల్లోనూ విద్యార్థులకు ఆసక్తి చూపేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్, ప్రిన్సిపాల్ బి బాలాజీ, ఏజీఎం వైఎస్ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ, కౌన్సిలర్ శ్యామల

నరసాపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం చైర్‌పర్సన్ పట్టణంలోని 30వ వార్డు స్టేషన్‌పేట ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల బోధన, తరగతి గదుల్లో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, మధ్య తరగతి పిల్లలకు పౌష్టికాహారం పాఠశాలల్లోనే అందించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక మెనూతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్థానిక కౌన్సిలర్ అడిదల శ్యామల తదితరులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి



స్పందనలో సమస్యలు తెలుసుకుంటున్న నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై అధికారులు తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు మొత్తం 39 ఫిర్యాదులు అందించినట్లు సబ్ కలెక్టర్ చెప్పారు. హౌసింగ్, భూతగాదాలు తదితర అంశాలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ముందుగా మండలస్థాయిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. స్పందన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని చెప్పారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

పెనుగొండ: ఆచంటలో ప్రసిద్ధి గాంచిన ఆచంటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే తిరునాళ్లలో ఆకతాయిలు ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆచంటేశ్వర స్వామి తిరునాళ్లపై కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయ ఈవో రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోట వెంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



పాలకొల్లులో స్వామివారి కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్, ట్రస్టీలు

పాలకొల్లు అర్బన్: స్థానిక యడ్లబజారులో వేంచేసియున్న కనకదుర్గా మల్లేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవాలు విజయవంతం చేయాలని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు కోరారు. అమ్మవారి ఆలయంలో కల్యాణాలు నిర్వహించుకునే భక్తుల కోసం ఆలయ వెనుక భాగంలో రెండు ప్రత్యేక గదులను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు చైర్మన్ శ్రీనివాసరావు వివరించారు. ఆలయానికి రంగులు వేసి కల్యాణోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నామన్నారు. చింతలపూడి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు బహూకరించిన రథానికి త్వరలో షెడ్డు నిర్మిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈవో ఎస్ సతీష్‌కుమార్, ట్రస్టీలు నుదురుపాటి శ్రీనివాసరావు, కెల్లా పెద్దిరాజు, గుండుబోయిన అరుణ కుమారి, రేలంగి నరసింహమూర్తి (దున్ను), వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ గుండుబోయిన నాగేశ్వరరావు, అర్చకస్వామి మోగంటి వెంకటరమణ, ఆలయ సిబ్బంది చిట్టి రాంబాబు, కె సత్యనారాయణ పాల్గొన్నారు.

మందులతో కుష్టు వ్యాధి నయం

పాలకొల్లు అర్బన్: సక్రమంగా మందులు వాడి, పౌష్టికాహారం తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. రోటరీ, ప్రభుత్వం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించిన స్పర్శ (కుష్టు నివారణ) పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉల్లంపర్రు సత్యసాయి కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో అవగాహన లేకపోవడం వల్ల రోగులు వికలాంగులుగా మారి ప్రతిరోజు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొంటూ జీవించేవారన్నారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రాంప్రసాద్ మాట్లాడుతూ ఎండీటీ మందులు వచ్చిన తరువాత కుష్టువ్యాధి పూర్తిగా అదుపులో ఉందన్నారు. రోగాన్ని తొలిదశలోనే గుర్తించి ఎండీటీ మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సజన,పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. రెండు హోండా యాక్టివాలు, ఆటోకు వేలం పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వేలం పూర్తయిన వెంటనే సొమ్ము చెల్లించి వాహనాలను పొందాలని ఎస్సై తెలిపారు.